క్లుప్తంగా...

ఆర్థిక సాయం



ఇమాం కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మిధాని డిపో ఉద్యోగులు

సంతోష్‌నగర్: ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కార్యాలయంలో ఎస్టీఐగా పనిచేస్తూ ఇటీవల మరణించిన ఇమాం కుటుంబానికి మిధాని డిపో సిబ్బంది బాసటగా నిలిచారు. గతంలో మిధానిలో పనిచేస్తూ అందరితో కలుపుగోలుగా ఉన్న ఇమాం మరణ వార్త తెలుసుకున్న డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు ఒక్కతాటి పైకి వచ్చి రూ.88 వేలు విరాళాలు వేసుకొని మృతుడి భార్యకు అందజేశారు. డిపో మేనేజర్ అంజనేయులు, సీఐ విజయ్ కుమార్, టీఐ ఇందిరా, సూపర్‌వైజర్ హజరుద్దీన్, వెల్ఫేర్ సభ్యులు సయ్యద్ జహంగీర్, రాధాల ప్రోద్బలంతో ఈ విరాళం సేకరించి ఆదర్శంగా నిలిచారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో బీఆర్ఎస్ నాయకులు కోటి శైలేష్ కురుమ, పప్పుమాత్రే తదితరులు

అబిడ్స్: జాంబాగ్ డివిజన్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు కోటి శైలేష్ కురుమ, పప్పుమాత్రే, అవతార్ యాదవ్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. పప్పుమాత్రే, కోటి శైలేష్ కురుమ మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు.

అన్నదానం



కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు శాంతిదేవి

గోల్కొండ: పేద ప్రజలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉందని బీఆర్ఎస్ నాయకురాలు శాంతిదేవి అన్నారు. శుక్రవారం గోల్కొండ రిసాలబజార్‌లో రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్, అన్నదాన కార్యక్రమం జరిగింది. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రమేష్ చారి, యాదగిరి, శ్రీకాంత్ చారి, చిన్నగౌడ్ తదితరులున్నారు.

చిన్నారులకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు



వేసవి శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాస్ ప్రతినిధులు

అఫ్జల్‌గంజ్: చిన్నారులకు ఉచిత వేసవి మ్యూజికల్ శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్, కోశాధికారి మేడిరెడ్డి రాకేష్‌లు తెలిపారు. శుక్రవారం ఉస్మాన్‌గంజ్‌లోని బాస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. బాస్ అనుబంధ సంస్థ సారస్వతం ఆధ్వర్యంలో నిర్వహించే మ్యూజికల్ శిక్షణ తరగతుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే కీ బోర్డు, డ్రమ్, కాంగ్, తబలల్లో శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం సారస్వత ప్రతినిధులు అనిల్ నాయర్, బద్రీ, భిక్షపతి అంజన్‌తో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 30న ప్రారంభమయ్యే శిక్షణ తరగతులు ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ఉంటాయన్నారు. ఈ శిక్షణలో చేరాలనుకునే వారు 93966 01234, 91330 61000లో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

‘ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహిస్తాం’

గోల్కొండ: చిన్నారుల కోసం ఉచిత సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని బీజేపీ నాయకులు, జనహిత్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి దేవర వంశీ అన్నారు. టీఎంఎల్ ఫౌండేషన్ సహకారంతో ఈనెల 24 నుంచి ఈ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. 5 నుంచి 10 ఏళ్ల లోపు వయస్సు గల పిల్లలు ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొనవచ్చని కార్వాన్ ఉప్పరబస్తీలోని రామచంద్రయ్య కమ్యూనిటీ హాల్‌లో ఈ సమ్మర్ క్యాంపు ఉంటుందని ఆయన తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఈ సమ్మర్ కాంపు ఉంటుందని మే 6న ముగుస్తుందని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జుమ్మాతుల్ విదా

- మండుటెండల్లో సైతం మక్కా మసీదులో ప్రార్థనలు
- శాంతి భద్రతలను పర్యవేక్షించిన నగర పోలీస్ కమిషనర్
- వాహనాల దారి మళ్లింపు



చార్మినార్: జుమ్మాతుల్ విదాను పురస్కరించుకొని మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయి. జుమ్మాతుల్ విదా సందర్భంగా ముస్లింలు చారిత్రాత్మకమైన మక్కా మసీదులో జరిగిన సామూహిక ప్రార్థనల్లో అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండుటెండల్లో సైతం చిన్నా పెద్ద అనే తారతమ్యం లేకుండా ముస్లింలు సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మక్కా మసీదు ప్రాంగణంతో పాటు చార్మినార్ రోడ్లపై ఏర్పాటు చేసిన కార్పెట్లపై సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. యునానీ భవన ప్రాంగణంలో ముస్లిం మహిళలు నమాజ్ చేశారు.

భారీ బందోబస్తు ..

ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దక్షిణ మండలం పోలీసులు అదనపు బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సామూహిక ప్రార్థనల అనంతరం మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన యౌముల్ ఖురాన్ పఠన కార్యక్రమంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాల్గొని ప్రసంగించారు. మక్కా మసీదు ఇమామ్ హాఫేజ్ మహ్మద్ రిజ్వాన్ ఖురేషీ నమాజ్ చేయించారు. ఈ ప్రార్థనలలో పలువురు మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పర్యవేక్షణలో దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యలతో పాటు ఐపీఎస్ అధికారులు శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

జుమ్మాతుల్ విదా సందర్భంగా వాహనాల దారి మళ్లింపు..

ఇప్పటికే చార్మినార్ నలువైపుల దారి మూసి వేయగా.. మిగిలిన చోట్ల జుమ్మాతుల్ విదా ప్రార్థనల సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో శాలిబండ నుంచి నయాపూల్ వరకు వాహనాలు వెళ్లడానికి ఎటువంటి అవకాశం లేకపోవడంతో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగాయి. చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, శంషీర్‌గంజ్, సయ్యద్ అలీ ఛబుత్రా తదితర ప్రాంతాల నుంచి వాహనాలన్నింటినీ హిమ్మత్‌పురా చౌరస్తా ద్వారా ఖిల్వత్ నుంచి మూసాబౌలి, సిటీకాలేజి చౌరస్తా ద్వారా దారి మళ్లించారు. నగరంతో పాటు అఫ్జల్‌గంజ్ నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలన్నింటినీ దారుషిఫా, మీరాలం మండి, బీబీబజార్ చౌరస్తా ద్వారా దారి మళ్లించారు. యాకుత్‌పురా, డబీర్‌పురా ద్వారా చార్మినార్ వచ్చే వాహనాలన్నింటినీ బీబీ బజార్, పురానీహవేలీ ద్వారా దారి మళ్లించారు. అలాగే పురానాపూల్, కసరట్ట, లాడ్‌బజార్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ముర్గీ చౌక్ ద్వారా మూసాబౌలి వైపు దారి మళ్లించారు.



హాజరైన మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



సామూహిక ప్రార్థనలను పర్యవేక్షిస్తున్న సిటీ సీపీ సీవీ ఆనంద్, డీసీపీ సాయి చైతన్య

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

- ఈద్–ఉల్–ఫితర్‌కు రౌండ్ ది క్లాక్ సేవలు
- టీఎస్ఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలం ఎస్ఈ అబ్దుల్ రహమాన్



విద్యుత్ సరఫరా పనితీరును పరిశీలిస్తున్న ఎస్ఈ అబ్దుల్ రెహ్మాన్, డీఈ లింగయ్యతో పాటు ఏడీఈలు

చార్మినార్: రంజాన్ పండగ (ఈద్–ఉల్–ఫితర్)కు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అదనపు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో సిద్ధంగా ఉంచామని టీఎస్ఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలం ఎస్ఈ అబ్దుల్ రహమాన్ అన్నారు. శనివారం ముస్లింలు ఈద్–ఉల్–ఫితర్ పండగను ఘనంగా నిర్వహించుకోనున్న సందర్భంగా శుక్రవారం టీఎస్ఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలం చార్మినార్ డివిజన్‌లోని డీఈ లింగయ్యతో పాటు ఏడీఈలు విజయ్ కుమార్, మధుసూదన్, ఏఈలతో నిరంతర విద్యుత్ సరఫరాపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరమైన మేరకు తమ పరిధిలో నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి తగిన కార్యాచరణను రూపొందించామన్నారు. రంజాన్ మాసం సందర్భంగా మక్కా మసీదులో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా యూపీఎస్‌తో పాటు చార్మినార్ ఏడీఈను రౌండ్ ది క్లాక్ విధి నిర్వహణలో నియమించామన్నారు. అలాగే మక్కా మసీదులో అనివార్య కారణాల వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెంటనే సరఫరాను పునరుద్ధరించడానికి ఇప్పటికే మూడు 500 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పంచ్ మొహల్లా, మ్యాగ్రిజ్ క్యాంప్, చార్మినార్ నిమ్రా హోటల్‌ల వద్ద అత్యవసరంగా ఏర్పాటు చేశామన్నారు. శాలిబండ, మదీనా, ఖిల్వత్, మక్కా మసీదు, చార్మినార్, పత్తర్ గట్టి, గుల్జార్‌హౌస్ తదితర ప్రాంతాల్లో 500 కేవీఏ టెంపరరీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 11 కేవీ జూపార్క్ విద్యుత్ ఫీడర్ నుంచి మీరాలం ఈద్గాకు విద్యుత్ సరఫరా జరిగే విధంగా మీరాలం వద్ద 500 కేవీఏ టెంపరరీ రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశామన్నారు.

పండగలను శాంతియుతంగా జరుపుకోవాలి



రూట్ మార్చ్‌లో పోలీసులు

గోల్కొండ: పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ టీంతో కలిసి గోల్కొండలో రూట్ మార్చ్ నిర్వహించారు. కోట మెయిన్ గేటు నుంచి ప్రారంభమైన రూట్ మార్చ్ ప్రధాన రహదారుల గుండా సాగింది. పండగ రోజు శాంతిభద్రతలకు ఏ మాత్రం భంగం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధాన కూడళ్లు, జామా మసీదుల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. శనివారం రోజున రంజాన్ ప్రార్థనలు జరిగే ఈద్గాలకు వచ్చే వారి కోసం ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రంజాన్‌లో జకాత్, ఫిత్రా తప్పనిసరి

గోల్కొండ: రంజాన్ మాసంలో పాటించాల్సిన పుణ్యపనులు ఎన్నో ఉన్నాయని, వాటిలో ప్రధానమైనది జకాత్, ఫిత్రా ప్రధానమైనవని ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు హజ్రత్ మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రి అన్నారు. రంజాన్ ఆఖరి శుక్రవారం ప్రార్థనల్లో భాగంగా గోల్కొండ దిలావర్‌షానగర్‌లోని అస్కరీ మసీదులో జరిగిన ప్రార్థనలకు ఆయన నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసానికి ఉన్న ప్రత్యేకతలలో తరావీ ప్రార్థనలు చాలా ముఖ్యమైనవన్నారు. ఖురాన్ గ్రంథ పఠనం గావించలేని వారు తరావీ ప్రార్థనల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న సయ్యద్ మతీన్ అలీషా

టీఎస్‌పీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏబీవీపీ నేతలు

నాంపల్లి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సిట్ విచారణ నివేదికను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ కల్యాణ్ నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం శుక్రవారం నాంపల్లి తహసీల్దార్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో నిరు ద్యోగులందరినీ రోడ్డు పాలు చేసి వారి జీవితాలను అయోమయంలో పడేసిన ఘనత టీఎస్‌పీఎస్సీకే చెందుతుందని తెలిపారు. టీఎస్‌పీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేయాలని, సిట్ చేపట్టిన విచారణ నివేదికను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే లీకేజ్ కుంభకోణం వెనుక ఉన్న ప్రభుత్వ పెద్దలను కటకటాల వెనక్కి నెట్టాలని డిమాండ్ చేశారు. సిటీ కళాశాల అధ్యక్షుడు దిలీప్, కార్యదర్శి సజన్ పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలకు ఆహ్వానం



హోం మంత్రిని ఆహ్వానిస్తున్న ఆకుల శ్రీనివాస్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలో నిర్వహించనున్న మే డే ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని హోం మంత్రి మహమూద్ అలీని బీఆర్‌టీయూ నియోజకవర్గం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కార్మిక నాయకులతో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో కార్మికులకు ఎంతో న్యాయం జరుగుతుందన్నారు. మే 1న పెద్ద ఎత్తున నిర్వహించనున్న ఈ వేడుకల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమం ప్రారంభించాలన్నారు. సెంట్రింగ్ కార్మిక నాయకులు ఆసిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రవీన్, రవీందర్ పాల్గొన్నారు.

రంజాన్ మాసపు స్ఫూర్తిని కొనసాగించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ముఫ్తీ మస్తాన్ అలీఖాద్రి

గోల్కొండ: రంజాన్ మాసంలో ముస్లింలు ప్రతి నిత్యం 5 పూటల నమాజ్ ఆచరించాలని, ఈ స్ఫూర్తిని మున్ముందు కూడా కొనసాగించాలని డాక్టర్ ముఫ్తీ మౌలానా మస్తాన్ అలీఖాద్రి అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షల ముగింపు సందర్భంగా టోలిచౌకి విరాట్‌నగర్‌లోని ఫైజ్ మసీదులో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతియుత సహజీవనమే ఉత్తమమని, ఈ విషయం ఇస్లాం గ్రంథాలలో స్పష్టంగా ఉందన్నారు. ప్రతిఒక్క ముస్లిం క్షమాగుణం కలిగి ఉండాలని, పగాప్రతీకారం లాంటి చర్యలకు పాల్పడే వారు అల్లా ఆగ్రహానికి గురవుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు వహీద్ అహ్మద్ తదితరులున్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



అవార్డు గ్రహీతలతో భానుప్రసాద్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తుందని శాసనమండలి సభ్యుడు, ప్రభుత్వ విప్ భానుప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో మదర్ ఫౌండేషన్, మెగాసిటీ నవకళావేదికల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని ఎంతో శ్రద్ధతో అమలు చేస్తున్నారని అందుకు నిదర్శనమే దళితుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలు అన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, అపోలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అవినాష్ చౌహాన్, మదర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



బిలాల్‌ను సత్కరిస్తున్న బెజిని శ్రీనివాస్, పలువురు వ్యాపారులు

అబిడ్స్: వ్యాపారులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ప్రముఖ వ్యాపార కేంద్రాలైన బేగంబజార్, సిద్ది అంబర్‌బజార్, మహారాజ్ గంజ్, ఉస్మాన్‌గంజ్, త్రూబజార్, గోషామహల్, ఫీల్‌ఖానా తదితర ప్రాంతాల్లో వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా నియమితులైన నందకిశోర్‌వ్యాస్ బిలాల్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బెజిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోషామహల్ ప్రాంతానికి చెందిన పలువురు వ్యాపారులు ఆయనను సత్కరించి అభినందించారు.

కమనీయం కూచిపూడి నృత్యం



గన్‌ఫౌండ్రీ: పిల్లల అభిరుచులకు అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేవీ.రమణాచారి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో శ్రీ శారద నృత్య నికేతన్ గురువు శైలజ ప్రసాద్ శిష్యురాలు బూసం దీత్యారెడ్డి కూచిపూడ నాట్య ఆరంగేట్రం కనుల పండువగా జరిగింది. ఆదితాళంలోని పలు అంశాలు, భామాకలాపం, మరకత మణిమయ, నీలాంబరి, థిల్లాన వంటి అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు గణేష్‌గుప్తా, మానసిక నిపుణులు డాక్టర్ బీవీ.పట్టాభిరామ్, డాక్టర్ పార్వతి వర్ధిని, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, తల్లిదండ్రులు రవికాంత్‌రెడ్డి, సునీత పాల్గొన్నారు.



నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గోల్కొండ: రంజాన్‌లో నిరుపేదలు సైతం పండగను సంతోషంగా జరుపుకోవడం కోసమే తాము నిరుపేదలకు నిత్యావసరాలు అందజేస్తున్నామని ప్రముఖ సంఘ సేవకుడు మహ్మద్ జాకెర్ అన్నారు. శుక్రవారం గోల్కొండ వద్ద బంజార దర్వాజ వద్ద చీరలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. 10 ఏళ్లుగా తాము వివిధ వర్గాల పండగల సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ కార్యదర్శి ఇలియాస్ అలీ తదితరులున్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు



ఇఫ్తార్ వేడుకల్లో నందకిశోర్ వ్యాస్ బిలాల్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్



ఇఫ్తార్ విందులో బోనాల శ్రీనివాస్, నరేష్ దూత్‌పాల తదితరులు

అబిడ్స్: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ వేడుకలు దోహదపడుతాయని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. సీతారామ్‌పేట్‌లో జరిగిన ఇఫ్తార్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. అన్ని వర్గాల ప్రజలకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉండి పలు అభివృద్ధి పథకాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, శైలేష్ కురుమ, పప్పుమాత్రే, సునిల్ సింగ్, అవతార్ యాదవ్, ఫయాజ్, ఇంతియాజ్, సల్మాన్ పాల్గొన్నారు.

అఫ్జల్‌గంజ్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులని ప్రజాఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం గౌలిగూడలో ఆ పార్టీ నాయకుడు దూత్‌పాల నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నపాగ రమేష్, ఎండీ నయీం, ఎండీ దావూద్ హారూన్, ఎండీ జలీల్, అరవింద్, షేక్ మహ్మద్, ఎండీ అయాన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

గోల్కొండ: మెహిదీపట్నంలోని శ్రీచైతన్య స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే సెలెబ్రేషన్స్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 5వ తరగతి పూర్తిచేసి ఆరోతరగతికి ప్రమోట్ అవుతున్న విద్యార్థులను సత్కరించి అభినందించారు. మెహిదీపట్నం జోన్ ఏజీఎం బి.కృష్ణ విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.స్వాతి, వైస్ ప్రిన్సిపాల్ పల్లవి, ప్రైమరీ ఇన్‌చార్జి షగుఫ్తా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో..

గుడిమల్కాపూర్‌లోని నారాయణ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే సెలెబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున విద్యార్థుల తల్లిదండ్రులు హాజరైన ఈ కార్యక్రమంలో ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్హానా మొబిన్ తదితరులు విద్యార్థులకు పట్టాలను అందజేశారు. విద్యార్థుల సందడితో స్కూల్ ఆవరణలో పండగ వాతావరణం నెలకొంది.





గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



డబీర్‌పురా: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పురానీహవేలి చెత్తబజార్ కమాన్ వద్ద శుక్రవారం 55–60 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుని వివరాలు ఆరా తీయగా యాచకుడిగా తెలిసింది. మృతుడు ముస్లిం మతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే 040–27854797లో సంప్రదించాలన్నారు.